# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 09 సెప్టెంబరు, 2025 | పేజీలు :08


## మిలాద్–ఉన్–నబి వేడుకల్లో కలెక్టర్ పమేలాసత్పతి




**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను మర్కజి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. హుస్సేనిపుర బొంబాయి స్కూల్ నుంచి నాకా చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, డిఎఫ్ఏ చౌరస్తా, గీతాభవన్ చౌరస్తా, బస్టాండ్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, తెలంగాణ అమరవీరుల స్థూపం మీదుగా రాజీవ్ చౌక్ కరీముల్లాషా దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌష్ ఆలం పాల్గొన్నారు. పలువురు వక్తలు ప్రసంగిస్తూ మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవాళికి ఆదర్శమని అన్నారు. హిందూ ముస్లింల ఐక్యతను చాటుతూ గంగా జమున తెహజీబ్‌లను కాపాడడంలో ఎప్పుడూ తెలంగాణ ముందుంటుందన్నారు. మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఫరీదా బాబా, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

# యూరియాకు కొరత లేదు.. : కలెక్టర్

### జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు..
### ఎవరి మాట నిజం..?

**ప్రజాపక్షం/నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో యూరియా ఎరువుల సమస్య మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తోంది.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ జిల్లాలో యూరియా కొరత లేదు,రైతులు భయపడాల్సిన అవసరం లేదు అని పదే పదే ప్రకటిస్తున్నారు.కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది.జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు చేయడం,ఎరువుల కోసం క్యూలలో నిలబడి ఆందోళనలు చేయడం అధికారుల ప్రకటనలకు,వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని స్పష్టంగా చూపుతోంది.

### అధికారుల ప్రకటనలు...వాస్తవానికి ఎంత దూరం?

జిల్లా కలెక్టర్,వ్యవసాయ అధికారి చెబుతున్న దాని ప్రకారం గోదాముల్లో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయి.అయితే నిల్వలు ఉన్నా,అవి సమయానికి రైతులకు ఎందుకు చేరడం లేదు? సమస్య సరఫరా వ్యవస్థలో ఉందా,



లేక పంపిణీలో లోపాలు ఉన్నాయా అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వడం లేదు.

### రైతుల ఆవేదన,రోడ్లపైకి నిరసనలు

అధికారుల ప్రకటనలకు విరుద్ధంగా,ముధోల్,ఖానాపూర్,నిర్మల్,కడెం మండలంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు నిరసనలకు దిగారు.ప్రస్తుతం పంటలకు యూరియా అత్యంత కీలకమైన దశలో ఉంది.ఈ సమయంలో ఎరువులు అందకపోతే తమ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల బ్లాక్ మార్కెట్ లో యూరియా అధిక ధరలకు అమ్ముతున్నారని,ఇది ఆర్థికంగా కుంగదీస్తుందని ఆరోపిస్తున్నారు.

### ప్రశ్నార్థకంగా మారిన అధికారుల మాటలు..

నిజమైన ప్రశ్నరైతు ఎందుకు నిరసనలకు దిగుతాడు.?కష్టపడి పొలం దున్నిన రైతు రోడ్లపైకి రావడం అతని చివరి ఆవేదన.అది కేవలం అపోహల వల్ల జరిగిందని చెప్పడం రైతు సమస్యలను నిర్లక్ష్యం చేయడమే కలెక్టర్,వ్యవసాయ అధికారి నిజ పరిస్థితి బహిరంగంగా వివరించాలి.ఎరువులు గోదాముల్లో ఉన్నాయా?అవి రైతులకు చేరే విధానం ఎక్కడ విఫలమవుతోంది?సమస్య సరఫరాలోదా,లేక నియంత్రణలోదా?వంటి విషయాలపై స్పష్టత ఇవ్వకపోతే రైతుల అనుమానాలు మరింత బలపడతాయి.అధికారుల మాటల కంటే,పంట నష్టపోతున్న రైతుల ఆవేదనే వాస్తవానికి దగ్గరగా ఉంటుంది.

## ప్రజావాణి అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ పట్టణం మార్కండేయ కాలనీ కు చెందిన వి. గోవర్ధన్ తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి డిఆర్డిఓ కు రాస్తూ అవసరమైనచర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జూలపల్లిమండల కేంద్రానికి చెందిన ఏ. పోషయ్య వృద్ధాప్యంలో ఉన్న తనకు ఇద్దరు కుమారులు సరిగ్గా చూసుకోవడం లేదని, తన కుమారులకు చెప్పి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి కు రాస్తూ విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం హనుమంతుని పేట గ్రామానికి చెందిన తీగల కొమురయ్య సర్వే నెంబర్ 34/ఏ లో గల 39 గుంటల భూమి కొత్త పాస్ పుస్తకంలో 36 గుంటలు మాత్రమే నమోదు అయిందని మిగిలిన భూమి తన పేరు మీద నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మరింత కష్టపడి పనిచేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వెలిచాల రాజేందర్‌రావు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీః**



కాంగ్రెస్ పార్టీకి కరీంనగర్ జిల్లా కంచుకోట అని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ కార్పోరేషన్‌తో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి స్వగృహంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పలుఅంశాలపైముఖ్యమంత్రితోప్రత్యేకంగా చర్చించారు. అన్ని అంశాలను ముఖ్యమంత్రి సావధానంగా విన్నారు. కరీంనగర్ ప్రజలు పార్టీ క్యాడర్‌తో ఉదయం నుంచి అర్ధరాత్రివరకుమమేకమవుతూకాంగ్రెస్ బలోపేతానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని రాజేందర్‌రావు వివరించారు. అదేవిధంగా కరీంనగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసాయని, నగరంలో దాదాపు అన్ని మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 30 కోట్ల ఉచిత విద్యుత్‌ను వినాయక మండపాలకు అందించడం రాష్ట్ర చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందన్నారు. ఉచిత విద్యుత్ అంశం రాష్ట్ర ప్రభుత్వానికి మంచి మైలేజీ ఇచ్చిందని , ప్రజల్లోనూ మంచి గుర్తింపు వచ్చిందని వివరించారు. రాబోయే దసరా ఉత్సవాలను ప్రత్యేకంగా ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కష్టపడి పనిచేస్తున్నామని, ప్రతి కార్యకర్తను సన్నద్ధం చేస్తున్నామని వివరించారు. ఉచిత విద్యుత్ సరఫరాపై ప్రత్యేకంగా పోస్టర్లు ముద్రించి ప్రజలకు అవగాహన కల్పించామని వివరించారు.ప్రణాళికతో కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తూ ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసి కరీంనగర్‌ను తెలంగాణలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, త్వరలోనే కరీంనగర్‌కు వస్తానని రాజేందర్‌రావుతో ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు.

## 10న తుది ఓటరు జాబిత

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సెప్టెంబర్ 10న స్థానిక సంస్థల తుది ఓటర్ జాబితా ప్రచురణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఓటర్, పోలింగ్ కేంద్రాల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ 650 ఓటర్లకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశామని,జిల్లాలో 123 ఎంపిటిసి,12 జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు.

# రైతులకు యూరియా కష్టాలు

## మాజీ వైస్ ఎంపిపి రవీందర్‌రావు





**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయటంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పాలనలో మళ్లీ యూరియా కష్టాలు మొదలయ్యాయని మాజీ వైస్ ఎంపీపీ సుదాటి రవీందర్ రావు అన్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద యూరియా కోసం ఉదయం నుండే చెప్పులు వరుసలో పెట్టి మరి యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి గంటల తరబడి ఉన్నారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యలపై మాజీ వైస్ఎంపీపీ రవీందర్ రావు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో లేని యూరియా కొరత ఇప్పుడు మళ్లీ మొదలయిందన్నారు.కేసీఆర్ హయాంలో సీజన్కు ముందే కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా నిల్వలను తెప్పించి రైతులకు సకాలంలో సరఫరా చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలను కేంద్రం నుంచి తీసుక రావటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ చూసినా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కేంద్రంపై కొట్లాడి రైతులకు సరిపడా యూరియాను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి అనూషతో మాజీ వైస్ ఎంపీపీ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు సరిపడా యూరియాను అందించాలని కోరారు.

# నానో యూరియా కొనుగోలుపై ఆసక్తి



**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులలో నానో యూరియా పట్ల ఆసక్తి పెరుగుతోంది. యూరియా బస్తాలు ప్రస్తుతం దొరకకపోవడంతో ముత్తారం మండలంలోని వ్యవసాయ సహకార సంఘంలో కార్యాలయంలో నానో యూరియా కొనుగోలులో రైతులు ఆసక్తి చూపారు. ఎందుకంటే ఇది అధిక దిగుబడిని ఇవ్వడమే కాకుండా, తక్కువ ఖర్చుతో కూడుకున్నది, పర్యావరణ అనుకూలమైనది. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే, నానో యూరియాను తక్కువ పరిమాణంలో ఉపయోగించినప్పటికీ సమర్థవంతంగా పనిచేస్తుంది, ఇది పంటల దిగుబడిని పెంచి, రైతుల ఖర్చులను తగ్గిస్తుంది. నానోటెక్నాలజీని ఉపయోగించి తయారు చేయబడిన ఈ ద్రవ రూప యూరియా, వాతావరణ మార్పులకు అనుగుణంగాస్థిరమైనవ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుంది.

# దళితులకు న్యాయం చేయాలని వినతి



**ప్రజాపక్షం/ముత్తారం :** దళితులకు న్యాయం చేయాలని పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన దళిత సంఘం నాయకులు మంథని రమేష్ తోపాటు దళిత నాయకులు సోమవారం కలెక్టర్ కి వినతిపత్రం అందించి కోరారు. అనంతరం దళిత నాయకులు మాట్లాడుతూ దళితులకు మూడేకరాల భూమి,దళిత పేదలకు అస్సైన్మెంట్ భూమి భద్రత,అస్సైన్మెంట్ భూమికి అన్ని హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతుంటే అధికారులు పూర్తి సమాచారం లేకుండా పట్టా భూమిలో హెచ్చరిక బోర్డులు పెట్టడమేంటని అన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో అస్సైన్మెంట్ పట్టాలు కలిగి ఉన్న అర్హులకు సమాచారం ఇవ్వకుండా ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా మండల రెవెన్యూ అధికారులు పట్టా భూమిలో హెచ్చరికల బోర్డులు పెట్టారని కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు.దీనికి కలెక్టర్ పూర్తి స్థాయిలో విచారణ జరిపి పట్టాలున్నవారికి న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

# చివరి మడి వరకు సాగునీరు అందిస్తాం

## ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధరః** చొప్పదండి నియోజకవర్గంలోని చివరి మడి వరకు సాగునీరు అందజేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సరైన వర్షాలు కురవకపోవడంతో పంటలకు సాగునీరు అందుతుందో, లేదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, రైతులెవ్వరూ ఆందోళనకు గురికావద్దన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయపూర్ రిజర్వాయర్‌కు గోదావరి జలాలను విడుదల చేసి , అక్కడ నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి సాగునీరు అందజేయాలని సంబంధిత శాఖ సీఈని కోరినట్లు తెలిపారు. సాగునీటి విడుదలకు సీఈ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు , రైతులు ఇబ్బంది పడకుండా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# రైతు భూమిలో నిల్వ చేసిన ఇసుక తీసేయాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** లీజు గడువు అయిపోయినా తన భూమిలో నిల్వ ఉంచిన ఇసుకను తీయాలని ఎన్నిసార్లు చెప్పినా లీజుకు తీసుకున్న వ్యక్తి స్పందించడం లేదని, వెంటనే తన భూమిలో నిల్వ ఉన్న ఇసుకను ఖాళీ చేయించాలని పెద్దపల్లిలో సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేసినట్లు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గట్టు భూమయ్య తెలిపారు. ఈమేరకు పిర్యాదు కాపీలను పెద్దపల్లి ప్రెస్ క్లబ్ కు అందజేశాడు.తన భూమిని ఇసుక రీచ్ కోసం కౌలుకు తీసుకున్న వ్యక్తి 2 ఏళ్ళు కౌలు చెల్లించి రీచ్ నిలిపివేయడంతో గత 2 ఏళ్లుగా కౌలు ఇవ్వకుండా దాదాపు 200 లారీలు ఇసుక నిల్వ ఉంచాడని అదనపు కలెక్టరుకు వివరించినట్లు తెలిపాడు. సదరు వ్యక్తికి ఎన్నో సార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ముత్తారం పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా వాయిదాల పేరుతో దాటవేస్తున్నాడని భూమయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు తన సమస్యను పరిష్కరించి ఇసుకను ఖాళీ చేయించాలని వినతి పత్రంలో కోరాడు.

# అక్రమంగా నిర్మించిన ప్రహరీగోడ తొలగించాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఎస్సారెస్పీ కాల్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణం చేపట్టిన ప్రహరీ గోడను తొలగించాలని సీతంపేట గ్రామ మాజీ సర్పంచ్ పులిపాక నగేష్ తో పాటు ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీతంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పులిపాక నగేష్ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కెనాల్ కాలువ భూమి కబ్జా పై గతంలో ఈ అక్రమ నిర్మాణం పై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా అధికారులు నిర్మాణం చేపట్టవద్దని పలుమార్లు చెప్పినప్పటికీ వినకుండా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కెనాల్ భూములపై అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. మరో మారు గ్రామస్తుల పక్షాన సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని నగేష్ తెలిపారు.ఈ ఫిర్యాదు మేరకు సోమవారం ఇరిగేషన్ అధికారులు వచ్చి కబ్జాకు గురైన ఎస్సారెస్పీ భూమిని కొలవడం జరిగిందని కాలువ భూములు కబ్జాబ్ చేసిన విషయం వాస్తవమేనని కబ్జాకు గురైన భూమిపై పూర్తి సమాచారం కోసం మంగళవారం సంబంధిత ఇరిగేషన్ డి ఈ తోపాటు అధికారుల ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ భూములను విచారణ చేపట్టి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారన్నారు.

# ఎస్ఐ దత్తాద్రికి సిఐగా పదోన్నతి

## స్టార్ అలంకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్




**ప్రజాపక్షం/జగిత్యాలః** జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లో సబ్ ఇన్స్‌ఫెక్టార్ గా పనిచేస్తున్న దత్తాద్రి సీఐగా పదోన్నతి పొందారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలువడం జరిగింది. ఈ సందర్బంగా పదోన్నతి పొందిన దత్తాద్రిని ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించి పదోన్నతి చిహ్నంగా మరొక స్టార్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తు ఎన్నో ఏండ్లుగా ప్రజా సంరక్షణ కోసం అవిశ్రాంతంగా చేస్తున్న కృషికి పదోన్నతి ఒక గొప్ప గుర్తింపు అన్నారు. పదోన్నతి అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయి వంటిదని ముఖ్యంగా పోలీసు శాఖలో మరింత బాధ్యతయుతంగా విధులు నిర్వర్తించవలసి ఉంటుందన్నారు. లభించిన పదోన్నతి ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించే విధంగా ముందుకు సాగాలని ఎస్పీ సూచించారు. సీఐగా ప్రమోషన్ పొందిన దత్తాద్రికి జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

# డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సంతోష్

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ః** జగిత్యాలడిటిఎఫ్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా గట్ల సతీష్ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు ఎన్నం రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇప్పటిరవకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ఏ.నరేంధర్ గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా పదోన్నతిపై మంచిర్యాల జిల్లా వెల్లినందున గట్ల సంతోష్ ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని రాంరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి డి.శ్యామ్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నారాయణరెడ్డిలు హాజరయ్యారు. జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు రామేశ్వర్, రవీంధర్‌రెడ్డి, పద్మ, కార్యదర్శులుగా రాజేంధర్, గంగారాజన్, నీలం సంపత్, అడిట్ కమిటీ కన్వీనర్ హరికృష్ణ, సాగర్‌లు పాల్గొన్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గట్ల సంతోష్‌ను అభినందిస్తు జిల్లా కమిటీ ఆమోదం తెలిపింది.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలో మంగళవారం చెట్ల కొమ్ములు తొలగించనున్నందున విద్యుత్ సరఫరా ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిలిపి వేయనున్నట్లు రామన్న పేట ఏఈ శ్రీనివాస్ తెలిపారు. దీని వలన కొండగట్టు సబ్ స్టేషన్ పరిది లో సర్వాపూర్ ,బల్వంతపూర్ గ్రామాలకు విద్యుత్ అంత రాయం ఏర్పడుతుందని ఏఈ వివరించారు. ఈ అంత రాయా నికి వినియోగ దారులు సహకరించాలని కోరారు.

# ఓటరు జాబితాపై సలహాలు



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమస్త రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ లో ప్రచురించిన ఓటర్ లిస్ట్ పై అభ్యంతరములు, సలహాల కోసం సమావేశం నిర్వహించడమైనది అని జగిత్యాల రూరల్ మండల ఎంపిడిఓ రమాదేవి తెలిపారు.

# ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే చెప్పండి



ప్రజాపక్షం/గంగాధర: ఎంపిటిసి, జడ్పీటిసిల ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలను ఎంపిడివో దమ్మని రాము కోరారు. సోమవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల మండల అధ్యక్షులతో అఖిలపక్ష రాజకీయ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎంపిడివో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ లిస్టు, పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఎవరైనా అభ్యంతరాలు, మార్పులు, సూచనలు, సలహాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఇప్పటికే మండలంలోని గ్రామ పంచాయతీల్లో ముసాయిదా జాబితాను ప్రకటించామన్నారు. వచ్చిన అభ్యంతరాలును పరిష్కరిస్తామన్నారు.జిల్లా పాలనాధికారి ఆమోదం అనంతరం తుది ఓటర్ల జాబితా , పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటిస్తామన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పురుమల్ల మనోహార్, మేచినేని నవీన్‌రావు, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, వడ్లూరి ఆదిమల్లు, జోగు సాగర్, ప్రవీణ్, ఎంపివో గౌరి రమేష్, కార్యాలయ సిబ్బంది జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

## విద్యతో పాటుగా వికాసం ఉంటుంది

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: విద్యాసంస్థలలో విద్యతో పాటుగా ఆటపాటలతో వికాసం ఉంటుందని,శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటే మానసికంగా ఉల్లాసం ఉన్నట్లేనని ఎల్లారెడ్డిపేట మండల విద్యాధికారి జి.కృష్ణ హరి మాట్లాడారు.మంగళవారం సాధు వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద అండర్ 14,17th క్రీడా నైపుణ్యం సాధించిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సత్తయ్య,సీఐ శ్రీనివాస్ గౌడ్,ఎస్ఐ రాహుల్‌రెడ్డి హాజరయ్యారు.మండల క్రీడామైదానంలో వాలీబాల్,కోకో,కబడ్డి క్రీడలను నిర్వహించగా విజేతలకు బహుమతులు అందించారు.అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు పాల్గొనగా విద్యార్థిని విద్యార్థులకు వివిధ జట్టులతో తలపడగా విజయం సాధించిన ఉన్నతపాఠశాలలు విజయదుందుభి మార్మోగించారు.ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్, అక్బర్, సునంద, దివ్య,ప్రధానోపాధ్యాయులు మనోహరాచారి, మధుమాలతి, మురళీధర్, కుమారస్వామి, చంద్ర శేఖర్, వెంకటరమణ పాల్గొన్నారు.

## వైద్య చికిత్సకు సాయం

ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బామ్మానాయక్‌తండా గ్రామానికి చెందిన పద్మకు రెండు మూత్రపిండాలు పాడయ్యాయి. వైద్య చికిత్సకు ఆమె ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలియడంతో గ్రామ తాజా మాజీ సర్పంచి బదావత్ రాజునాయక్ లక్ష్మి దంపతులు తమ వంతు చేయూతను అందించారు. సోమవారం కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పద్మను వారు పరామర్శించారు. వైద్య చికిత్సకై రూ.10 వేలు సాయాన్ని పద్మకు అందించారు. పద్మకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరినట్లు రాజునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడ్ రమేష్, భూక్య రాజేష్, మాజీ వార్డు సభ్యుడు సన్ని తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలు

ప్రజాపక్షం/గొల్లపల్లి : తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మంజూరైన ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గొల్లపల్లి మండలంలోని ఇస్రాజ్ పల్లిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి ,ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ ,ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గ్రామానికి చెందిన అర్హులైన 20 మంది లబ్ధిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,మాజీ సర్పంచ్ లు చిర్ర గంగాధర్ ,పురం శెట్టి వెంకటేశం ,మాజీ ఉప సర్పంచ్ కొండ వెంకటేష్ గౌడ్ తదితరులున్నారు.

## గ్రామ పంచాయతీలకు 42బూత్‌ల వారీగా ఓటరు లిస్టు



ప్రజాపక్షం/ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడివో రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ఓటర్ల జాబితాపై వివిధ పార్టీల నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందకుంట మండలంలోని 42 బూత్‌ల వారీగా ఓటరు లిస్టు తయారు చేసి గ్రామ పంచాయతీలకు పంపించడం జరిగిందన్నారు. ఓటరు లిస్టుపై మండలంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు లిస్టును పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లక్ష్మ ణపల్లిలో ప్రజల సౌకర్యార్థం ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా అన్ని పార్టీల అధ్యక్షులు , ఎంపిడివోకు తెలియజేయగా ప్రభుత్వానికి రాస్తామని తెలిపారు.బిజెపి మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి మాదారపు రత్నాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, బిఆర్ఎస్ ప్రతినిధి కందాల కొమురెల్లి, సిపిఎం మండల కార్యదర్శి చెల్పూరి రాములు తదితరులున్నారు.

## వేలాదిమంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: హుజురాబాద్ పట్టణం నడిబొడ్డున వేలాది మంది విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యం, సుధాకర్ పెట్రోల్ బంక్ యాజమాన్యాలపై చట్టపరంగా చర్య లు తీసుకోవాలని బిసి విద్యార్థి సంఘం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సిరిసెట్టి రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నగరంలోని మాంటిస్సోరి స్కూల్, సుధాకర్ పెట్రోల్ బంక్‌లు పక్క పక్కనే ఉన్నాయని పేర్కొన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే స్కూల్‌లో చదువుతున్న వేలాదిమందిపిల్లలప్రాణాలకుఅపాయ ముందని, వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, విద్యా శాఖ, అగ్నిమాపక శాఖ, సివిల్‌సప్లైశాఖల అధికారులకు గతంలో ఫిర్యాదులు చేశామన్నారు. స్కూల్‌కు చెందిన బస్సు ఒకటి ఇటీవల మంటలు అంటుకున్నాయని, స్థానికులు చూసి అప్రమత్తమవడంతో పెద్ద నష్టం తప్పిందన్నారు. ఆ రోజు స్కూల్ లేదని, ఉండి ఉంటే పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి ఊహించని అతిపెద్ద ప్రమాదం జరిగేదన్నారు. ఇంత జరిగినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో హైకోర్టులో ఈ అంశంపై కేసు వేశామని తెలిపారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు కరీంనగర్ సిపికి విచారణకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసు అధికారులు లోతుగా ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా విచారణ జరిపి పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, ప్రణయ్, ప్రదీప్, నితిన్, తదితరులున్నారు.

## పత్తి, వరి పంటలపై రైతులకు అవగాహన ఉండాలి



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గోవింద పల్లె గ్రామంలో అగ్రి సైన్స్ క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సోమవారం ,ఎల్ టి డి రీజినల్ డైరెక్టర్ మహిపాల్ ఆధ్వర్యంలో పత్తి ,వరి ,కూరగాయ పంటలపై 70 మంది రైతుల తో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో వచ్చే మోగి పురుగు , అగ్గి తెగులు నివారణకు, అధిక పిలకలు రావడానికి వసుధ ఒక కేజీ మందు, మొగి పురుగుకు గుళికలు వరిలో వచ్చే అగ్గి తెగులు జింక్ పురుగు నివారణకు బుజా నాలుగు కిలోల మందును ఉపయోగించాలని తెలిపారు .పత్తి పంటలో రసం పీల్చే పురుగు ,కాయ తొలుచు పురుగులకు వారాహి అనే మందు వాడాలని అలాగే పత్తి పెరగడానికి కాయలు బలంగా వృద్ధి చెందడానికి కల్కి ,ఫైన్ ,బూస్ట్ , విక్టర్, అద్వైతమందులు రైతులు వాడుకోవాలని ఆయన తెలిపారు . కంపెనీ యొక్క మందులు సంబంధిత ఫర్టిలైజర్ దుకాణంలో అందుబాటులో ఉన్నాయని కావలసినవారు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు .కూరగాయలు ,పళ్ళ తోటలకు కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు .ఆరోగ్యవంతంగా రైతులకు ఆరోగ్యకరమైన జీవితం ఒక సేంద్రియ ఎరువులు వినియోగించిన ఆహారం తీసుకోవడం మాత్రమే అలాగే సేంద్రియ ఎరువులు వినియోగించడం వలన భూసారం పెరిగి మొక్కలు ఆరోగ్యవంతంగా ఉండి అధిక దిగుబడులు వస్తాయని వారు పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్, ఎస్ ఓ శంకర్ , గొల్లపల్లి భాగ్యలక్ష్మి సీడ్ ,ఫెర్టిలైజర్ స్థానిక డీలర్ నల్ల రాజిరెడ్డి ( పత్తి) రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ : మా భూమిలో పంటను ధ్వంసం చేసి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే మాపైననే అక్రమ కేసు పెట్టారని మాకు న్యాయం చేయాలని కమాన్‌పూర్ మండలం పెంచికల్ పేటకు చెందిన కొలిపాక లీల, పర్వతాలు దంపతులు వేడుకున్నారు. ఈ మేరకు పెద్దపల్లి కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 2 ఎకరాల పంటకు ఇరుగురాల శేఖర్ అనే వ్యక్తి గడ్డిమందు స్ప్రే చేసి నాశనం చేశారని ఆరోపించారు. మమ్మల్ని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు తమకు న్యాయం చేయాలని వినతిపత్రం కోరినట్లు తెలిపారు.

## ఘనంగా ఫిజియోథెరపీ డే

### సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్



ప్రజాపక్షం/పెద్దపల్లి : సోమవారం రోజున ప్రపంచ ఫిజియోథెరపీ దే సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో డిసిహెచ్ఎస్, డిఎంఅండ్ హెచ్ఓ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ డే ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఫిజియోథెరపీ ఉపయోగాలు మరియు దాని ప్రాముఖ్యతని వివరించి ఫిజియోథెరపిస్టులు డా. శ్రావణి, డా. మౌనిక మరియు డా. ఆయేషా సిద్ధికి లను సన్మానించడం జరిగిందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూగత సంవత్సర కాలం గా ఫిజియోథెరపీ సేవలు గణనీయంగా పెరిగాయనీ, కలెక్టర్, ఎమ్మెల్యే విజయరమన రావు ప్రత్యేక చొరవ పర్యేక్షణ వల్ల ఆధునిక పరికరాలు అందుబాటులో కి వచ్చాయనీ, గతంలో నెలకి 200 పేషంట్స్ కి సేవల అందించే హాస్పిటల్ ఇప్పుడు నెలకి 600 కి పెరిగాయనీ,ప్రజలు ఈ ఆధునిక పరికరాల సేవలు వినియోగించుకోగలరని సూపరింటెండెంట్ డా శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వందశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యం



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలో అమలవుతున్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వందశాతం అక్షరాస్యత సాధించి తీరుతామని వయోజన విద్యా అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్ తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంను పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన విద్యార్థుల ర్యాలీ లో పాల్గొని ఉల్లాస్ ప్రాముఖ్యత ను వివరించారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి మండల విద్యాధికారి టి. సురేందర్ కుమార్, అమర్ నగర్ ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, పెద్దపల్లి క్లస్టర్ సి ఆర్ పి బాలసాని వెంకటేశం తో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

ప్రజాపక్షం/రామడుగు:మాలమహానాడు రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ముట్టడిలో భాగంగా సోమవారం మండల మాల సంఘం నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాల మహానాడు సోషల్ మీడియా కో ఆర్డినేటర్ జవ్వాజి అజయ్ మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ జరిగే వరకు జీవో 99 వెనక్కి తీసుకోవాలని, రోస్టర్ పాయింట్లు 22 నుంచి వన్ పాయింట్‌కు తగ్గించేలా సవరించాలని డిమాండ్ చేశారు. మాలల హక్కులు, విధులు సాధించుకునే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. మండల అధ్యక్షులు పల్లంటి చంద్రయ్య, గ్రామ అధ్యక్షుడు కర్ణ శ్రీను, శ్రీరాములపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గాదం మాణిక్యం తదితరులున్నారు.

# ధర్మపురి ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలి

**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను 24గంటలు అందుబాటులో ఉంచాలని అదే విధంగా ఆసుపత్రిలో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం ధర్మపురి బిజెపి నాయకులు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సమస్యలను తెలుపుతూ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని దశలవారీగా 30 పడకల నుండి 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసినప్పటికి రోగులకు వారి సహాయకులు అవసరమైన కనీస సౌకర్యాలు ఆసుపత్రిలో కరువయ్యాయని పేర్కొన్నారు. 24గంటలు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు మధ్యాహ్నం దాటితే అందుబాటులో ఉండటం లేదని అత్యవసర వైద్యం అవసరం అయితే ఫోన్‌ద్వారా రప్పించాల్సిన దుస్థితి నెలకొందని బిజెపి నాయకులు ఆరోపించారు. రోగి జబ్బును సరైన పద్ధతిలో పరీక్షించకుండానే అందరికి ఒకే విధమైన మందులు రాస్తూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. లక్షల రూపాయల విలువ చేసే ఆక్సిజన్ ప్లాంట్ వినియోగంలో లేక శిథిలావస్థకు చేరిందని చెప్పారు. రోగులు రక్త పరీక్షల ఫలితాలు రావడానికి రెండు రోజుల సమయం పడుతుందని జబ్బు నిర్ధారణకై తిరగాల్సి రావడం శోచనీయమన్నారు. పరీక్షలు ప్రసవం కోసం నిత్యం పెద్ద సంఖ్యలో మహిళలు ఆసుపత్రికి వస్తున్నప్పటికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరకక ఇబ్బందులు ఎదురవడం జరుగుతుందని బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. చిన్న పిల్లల వైద్యునితో పాటు అత్యవసర సేవలు అందించేందుకు వైద్యులను 24గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు కలెక్టర్‌ను వినతి పత్రం ద్వారాకోరారు.బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవన్, పట్టణ ప్రధాన కార్యదర్శి టి. సత్యనారాయణ, సంగి మాధవ్ ఉన్నారు.

## మంథని ఠాణాను తనిఖీ చేసిన సిపి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** మంథని పోలీస్‌స్టేషన్‌ను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనితీరు, అధికంగా నమోదైన కేసులు, గ్రామాల వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీయడంతోపాటు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించారు. గోదావరినది పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సీపీ సూచించారు.

## గల్లంతైన యువకుడి కోసం గోదావరిలో గాలింపు

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గణేష్ నిమజ్జనం సందర్భంగా ఈనెల 6న గోదావరిఖని సమీప కోల్ బెల్ట్ వంతెన వద్ద గోదావరినదిలో గల్లంతైన రామగుండం అక్బర్‌నగర్‌కు చెందిన రాజేష్ యాదవ్ కోసం పోలీసులు సోమవారం గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరిఖని ఎసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్ కెమారాలు, గజ ఈతగాళ్ల సాయంతో పడవల్లో నదిలో వెతుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి దిగువకు కొంత మేర నీటి విడుదల నిలిపివేయడంతో గోదావరిలో యువకుడి అచూకీ కనుక్కునేందుకు వీలు ఏర్పడింది. కాగా, గత మూడు రోజులుగా తమ కుమారుడి జాడ తెలియకపోవడంతో రాజేష్ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.


## మానేరులో ముగిసిన కబడ్డీ క్రీడోత్సవాలు




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో గత రెండు రోజులుగా కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఇ పాఠశాల ఆవరణలో జరిగిన కరీంనగర్ అర్బన్ ఎస్‌జిఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలు సోమవారంతో ముగిసాయి. అండర్ 14, 17 బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ పోటీలకు సుమారు 70 పాఠశాలల నుంచి 2 వేల మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. రాత్రి జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మానేరు విద్యాసంస్థల చైర్మన్‌కడారి అనంతరెడ్డి, ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సిహెచ్ సంపత్‌రావులు హాజరై ట్రోఫీలతో పాటు బంగారు, రజత పతకాలను ప్రధానం చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లే విద్యలోనూ రాణించాలని , అప్పుడే వారు సాధించిన సర్టిఫికెట్లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రీడల్లో ఉన్నతంగా శిక్షణ పొంది రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. మానేరు పాఠశాలలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో ఏదైనా క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, అర్బన్ జోన్ క్రీడా సమాఖ్య కార్యదర్శి అంతటి శంకరయ్య, పిఇటిలు, పిడిలు, పిడిలు సిలివేరి మహేందర్,లింగారావు,శ్రీధర్‌రెడ్డి,చిరంజీవి, అజయ్‌లున్నారు.

## డిజిటల్ టెక్నాలజీతో మారనున్న ఉన్నత విద్యా వ్యవస్థ

### ఎస్‌యు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** శాతవాహన విశ్వవిద్యాలయం సెంటర్ ఆప్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలిసీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఈ రిసోర్సెస్ అండ్ డిజిటల్ లైబ్రరీస్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్' అనే జాతీయ వర్క్‌షాప్ సోమవారం కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ పిజి కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌యు విసి ఉమేష్ కుమార్ హాజరై మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ వల్ల ఉన్నత విద్యావ్యవస్థ రూపురేఖలు మారుతున్నాయని, ఆన్‌లైన్ లైబ్రరీలు, ఈరిసోర్సెస్ వినియోగం ద్వారా విధ్యార్థులకు మరింత విస్తృతమైన జ్ఞానాన్ని అందించవచ్చని అన్నారు. డిజిటల్ లెర్నింగ్ టూల్స్ విద్యారంగానికే కాకుండా కళాశాలల పరిపాలనకు సమర్ధవంతంగా మార్చుతాయన్నారు. నూతన తరానికి అందుబాటులో ఉండే సాంకేతికతను ఉపయోగించి బోధన అభ్యాస ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుదర్శన్‌రావు మాట్లాడుతూ డిజిటల్ లిటరసీ ప్రస్తుత తరానికి ప్రాథమిక నైపుణ్యం, ప్రతి అధ్యాపకుడు తన బోధన విధానంలో ఈ రిసోర్సెస్ అనుసంధానం చేయాలన్నారు. వాగేశ్వరి విద్యాసంస్థల చైర్మన్ బివి గోపాల్ రెడ్డి, భావన్స్ వివేకానంద కళాశాల డా.ఎంవిఎస్ మహేంద్ర, రిటైర్డ్ ప్రొఫెసర్ సి.విష్ణువర్ధన్ రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ వీర సోమయ్య, ఐక్యూఏసి డైరెక్టర్ , శాతవాహన యూనివర్సిటీ డా.ఎన్‌వి రంగ ప్రసాద్ , ఎస్‌యు పరిధిలోని ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కొరతపై చల్మెడ విమర్శలు

**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** గత పది ఏళ్ల బిఆర్‌ఎస్ పాలనలో యూరియా కొరత లేనిది, ఇప్పుడు ఎం దుకు తీవ్ర సమస్యగా మారిందని వేములవాడ నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్. రైతుల పట్ల వారికి విలువే లేదని,ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పే మాటల్లోనే తేడాలు ఉన్నాయని ధ్వజమెత్తారు.రుద్రంగి నుంచే యూరియా కొరత మొదలై ఇప్పటికీ కొనసాగుతోంది. సిరిసిల్ల జిల్లాలోనే కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పోలిస్తే ఎక్కువ కొరత ఉంది. ఇంకా 6 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందన్నారు. రైతులు యూరియా కోసం అడిగితే కేసులు పెడుతున్నారు..సొసైటీ వద్ద రైతులకు అండగా నిలిచిన ఎనిమిది మంది బిఆర్‌ఎస్ నాయకులపై కేసులు ఎందుకు పెట్టారు. కేసులు కాకుండా సమస్యను పరిష్కరించడం ఎంఎల్ఏ బాధ్యతని ప్రశ్నించారు.గడిచిన 21 నెలల్లో ఏం చేశారు? గత పదేళ్లలో మేము సేకరించిన భూముల్లోనే మీరు డెవలప్‌మెంట్ చేస్తున్నారు. రైతులను బెదిరించడం, సారీ చెప్పించడం, ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఇదేనా ఇందిరమ్మ రాజ్య పరిపాలన అని ఎద్దేవా చేశారు.

### సమ్మక్క జాతర ముందు భక్తులకు దర్శనం కల్పించండి..

ఆలయాభివృద్ధి పనులపై చల్మెడ ఫైర్ అవుతూ...రాజన్న ఆలయం ముందు నుంచి మూలవాగు వంతెనల వరకు కోట్ల రూపాయలతో రోడ్ల విస్తరణ చేపడుతున్నారు. రెండో వంతెన పూర్తయితే తప్ప మీ చేసిన పనికి ఫలితం ఉండదు. ముందు ఆ వంతెన పూర్తి చేయండన్నారు.అధికారులు స్వయంగా విజయదశమికి ఆలయాన్ని మూసివేస్తామని చెబుతున్నారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు రాజన్న దర్శనం కోటి మందికి పైగా భక్తులు చేస్తారు. వారికి దర్శనం కల్పించాలని సూచించారు. నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, తీగల రవీంద్ర గౌడ్ పోలాస నరేందర్ , రామతీర్థం రాజు ఆకుల దేవరాజమం పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలపై ప్రజావాణిలో ఫిర్యాదు



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బర్మా, శ్రీలంక కాందిశీకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇండిబెల్లి రవీందర్‌కుమార్ తెలిపారు. గత వారం రోజుల నుంచి అంతర్గాంలో మూతపడిన వీవింగు, స్పిన్నింగు మిల్లులకు చెందిన కాందిశీకుల పునరావాసకాలనీలోని భూములను కొందరు వ్యక్తులు అక్రమించి మట్టి తవ్వకాలు, రవాణా చేపడుతున్నారని ఫిర్యాదులోపేర్కొన్నట్లు తెలిపారు. గతంలో అనేకమార్లు మిల్లులకు చెందిన భూముల కబ్జాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, మిల్లుల స్థిర, చరాస్తులను కాపాడాల్సిన జిల్లా ఉన్నతాధికారులు వాటి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారని, మిల్లుల భూముల కబ్జా, మట్టి తవ్వకాలు, రవాణాను అడ్డుకోవాలని కోరినట్లు రవీందర్‌కుమార్ తెలిపారు.

## కమ్యూనిటిహాల్ స్థల పరిశీలన

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కాలనీ క్వార్టర్లలో నివసిస్తున్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు స్థానిక పాత సూపర్ బజార్ పరిసర ప్రాంతంలో మినీ కమ్యూనిటిహాల్ భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం సింగరేణి అధికారులు, గుర్తింపు సంఘం ఎఐటియుసి యూనియన్ నాయకులతో కలిసి భవన నిర్మాణ ప్రతిపాదన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులను అంచనా వేశారు. ఈ పరిశీలనలో ఆర్జీ1 అధికారులు పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్, సివిల్ ఎస్ఈ వసంత్‌కుమార్, ఎఐటియుసి డిప్యూటి సెక్రటరి మడ్డి ఎల్లయ్య, బ్రాంచి సెక్రటరి ఆరెల్లి పోషం, మహేష్, వెంకటరెడ్డిలు పాల్గొన్నారు.

## వేములవాడ ఎఎస్‌పితో రాజన్న ఆలయ ఇఒ భేటీ

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈఓ రమాదేవి, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఏఎస్పీకి స్వామివారి శేష వస్త్రం మరియు లడ్డు ప్రసాదం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులపై చర్చించి, ఇరు విభాగాల సమన్వయంతో దేవస్థానాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లే విషయంలో సంప్రదింపులు జరిపారు.

## 110మందికి రక్త, కంటిపరీక్షలు

**ప్రజాపక్షం/ వేములవాడ :** రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వేములవాడ పట్టణంలోని మాతృశ్రీ హాస్పిటల్ లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహించారు. డాక్టర్లు చింతల ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ బృందం ఆధ్వర్యంలో 110 మందికి రక్త, కంటి పరీక్షలు చేయగా, 38 మంది ఆపరేషన్ కు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ కంటి ఆపరేషన్ చేయించుకునే వారిని వేములవాడ నుంచి రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచితంగా బస్సులో తీసుకువెళ్లి, మళ్లీ తీసుకువస్తామని తెలిపారు. ఆపరేషన్ చేసిన తర్వాత ఉచితంగా మందులు, కంటి అద్దాలు ఇస్తారని, బోజన సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు. ఈ వైద్య శిబిరానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో లయన్ బచ్చు వంశీకృష్ణ, లయన్ డాక్టర్ కోయినేని ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపిడిఒ సమావేశం

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** కాగజ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ కోట ప్రసాద్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విడుదల చేసిన ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల షెడ్యూల్ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఓటరు జాబితాలో, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా అభ్యంతరాలను ఈనెల 9వ తేదీన పరిష్కరించి 10వ తేదీన తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కీమ్స్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో సొసైటి ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షల్లో ఎంపికైన 10 మంది క్యాటరక్ట్ పేషంట్లను సొసైటి ఖర్చులతో రవాణా, భోజనం సదుపాయం కల్పించి బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా సొసైటి ఆధ్వర్యంలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని, ఇప్పటి వరకు వేల మందికి ఉచిత కంటి ఆపరేషన్‌లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీమ్స్ ఆసుపత్రి సిబ్బంది గోపి, సిబ్బంది, పాల్గొన్నారు.

## అక్షరాస్యతే సమాజ అభివృద్ధికి మూలం


**ప్రజాపక్షం/దండేపల్లి :** ప్రతి మనిషి జీవితంలో చదువు అత్యంత ముఖ్యమైన ఆయుధమని, అక్షరాస్యత ద్వారానే సమాజంలో గౌరవం, సుస్థిరత, శాంతి నెలకొంటుందని దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రాజేశ్వరరావు స్పష్టం చేశారు. అంతర్జాతీయ అక్షరాస్య దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులు దండేపల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌మాస్టర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోనే దండేపల్లి మండలాన్ని 100 శాతం అక్షరాస్య మండలంగా నిలపాలని పిలుపునిచ్చారు. అందరూ చదవాలి, అందరూ ఎదగాలని, ముఖ్యంగా మహిళలు అక్షరాస్యతలో ముందంజలో ఉండాలని కోరారు. విద్య అంటే కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాక, సమాజంలో చైతన్యం పెంపొందించడానికి, సమానత్వాన్ని నెలకొల్పడానికి అత్యవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు 'అక్షరాస్యతే అభివృద్ధికి పునాది', 'ప్రతి ఒక్కరూ చదువుకి ముందడుగు వేయాలి' అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సిఆర్‌పి తో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

## నానో యూరియా.. రైతుకు భరోసా



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్‌రూరల్/దహెగాం:** నానో యూరియాతో పంట దిగుబడి పెరిగి రైతుకు భరోసాగా నిలుస్తుందని మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ అన్నారు. దహెగాం మండలంలోని రాంపూర్, మొట్లగూడ గ్రామాల్లో ఆయన పర్యటించి నానో యూరియాపైన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నానో యూరియా ద్రవరూపంలో ఉండే ఎరువు అని, మొక్కలకు అవసరమైన పోషకాలను మాత్రమే అందిస్తుందని చెప్పారు. సంప్రదాయ యూరియాతో పోలిస్తే ఎన్నో లాభాలు ఉన్నాయని ఖర్చుకూడా చాలా తగ్గుతుందని వివరించారు. ఎలాంటి కాలుష్యం కాదని నానో యూరియా వాడటం వల్ల పంట దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. నానో యూరియా వాడి భూసారం కోల్పోకుండా చూసుకోవాలని రైతులనున కోరారు. అదే విధంగా రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. రైతులు ఈ సీజన్‌లో ఏఏ పంటలు సాగు చేశారో వాటి పూర్తి వివరాలను ఏఇఒ వద్ద పంట నమోదు చేసుకోవాలని అన్నారు. కౌలు చేస్తున్న రైతులు కూడా కౌలు పత్రం ఇస్తే పంటలు అమ్మే సమయంలో ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉంటుందని అన్నారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ శాఖ వారిని సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇఒలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సారథి కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నస్పూర్:** జిల్లా సారథి కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక గదిని కేటాయించాలని, కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సారథి కళాకారులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి సురేందర్ మాట్లాడుతూ జిల్లాలోని కళాకారులు అవసరమైన సామగ్రి నిల్వ చేసుకోవడానికి, తమ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి, ప్రత్యేక వేదిక అవసరమని, కళాకారులు జిల్లాలోని అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో జిల్లా కేంద్రంలో వేదిక లేకపోవడంతో రూట్ మ్యాప్, ఇతర సామగ్రి భద్రపర్చడం కష్టతరంగా మారిందని వివరించారు. దీనిపై వెంటనే సానుకూలంగా స్పందించిన కలెక్టర్, కలెక్టరేట్ కార్యాలయంలోనే ఒక గదిని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖ అధికారులు కళాకారుల సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. కలెక్టర్ నిర్ణయం కళాకారులందరికీ ఎంతో ఉపయుక్తమని, సమస్యల పరిష్కారానికి ఇది ఒక ముందడుగని వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మామిండ్ల లచ్చన్న, ఉపాధ్యక్షుడు వెల్మూరు పోశం, ప్రధాన కార్యదర్శి గొడిసెల కృష్ణ, సహాయ కార్యదర్శి వావిలాల నాగలక్ష్మి , కోశాధికారి కొప్పర్తి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్, మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణకారులని, వారి సేవలతోనే దేశం బభిష్యత్తు నిర్మాణ సాధ్యమవుతుందని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన సందర్భంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం ఉపాధ్యాయుల త్యాగాలు, సేవలను గుర్తు చేస్తుందని, విద్యార్థులను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రధాన ధ్యేయం కావాలన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తి గొప్పదనాన్ని కొనియాడుతూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ వేడుకల్లో మండలంలోని ఎనిమిది కాంప్లెక్స్‌ల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఇతర ప్రధానోపాధ్యాయులు, ప్రతి పాఠశాల నుండి ఒక ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల కృషి గుర్తిస్తూ ప్రతీ కాంప్లెక్స్ నుంచి ఒక ఉత్తమ ఉపాధ్యాయుని చొప్పున ఎంపిక చేసి , మొత్తం 9 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పీజీహెచ్ఎం చిలుకూరి సత్యనారాయణ, అనురాధా, శ్రీలత, వరలక్ష్మి, అమరేందర్ రెడ్డి, వెంకట్రాజయ్య, ప్రధానోపాధ్యాయులు తాటి రవీందర్, పర్శ చంద్రశేఖర్, తపన్ రాయి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** జిఎస్‌టిపై సంస్కరణలు తీసుకువచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి బిజెపి మండల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా, దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిపై చేసిన మార్పులు పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా ఉన్నాయని అన్నారు. రైతుల నుంచి వ్యాపారుల దాకా, ఇళ్ల నుండి కంపెనీల వరకు అందరికీ లాభదాయకమని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బిజెపి ప్రభుత్వం పని చేస్తోందని, దేశ ప్రజలకు మోడీ చారిత్రాత్మక దీపావళి బహుమతి అందజేశారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కుకుడే రాజేష్, జిల్లా పరిషత్ సభ్యుడు సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు బోట్టుపల్లి హరీష్, బిజెవైఎం మండల అధ్యక్షుడు పాలే సంతోష్, ఎస్సి మోర్చా మండల అధ్యక్షుడు పాగిడి కాంతారావు, ఒబిసి మోర్చా మండల అధ్యక్షుడు భుజంగరావు, మాజీ సర్పంచ్ నాగన్న, బిజెవైఎం నాయకులు పురుషోత్తం, బాపూజీ, రవీందర్, అజయ్, రాజన్న, ప్రసాద్, నాన్నయ్య, కమలాకర్, అనంతరావు, నరేష్, ఎంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**ప్రజాపక్షం / జన్నారం:** రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న దాముక కమలాకర్‌కు రేండ్లగూడ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. జన్నారం మండల కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కమలాకర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ఇటీవల సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ శుభసందర్భంగా రేండ్లగూడలో కమలాకర్ దంపతులను సంఘం సభ్యులు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బండోజు లక్ష్మీనర్సయ్య, వెయికండ్ల రవిచారి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనం ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలంలో సోమవారం 108 వాహనాన్ని ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు అత్యవసర సేవల కోసం 108 వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సిబ్బంది వెంటనే స్పందించి 15 నిమిషాల్లో రోగులను సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. నెలకు 150కి పైగా కేసులు నిర్వహిస్తున్నామని, అంబులెన్స్‌లోనే ప్రసవాలు కూడా విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలు లేదా అనారోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే స్పందిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్నామని అన్నారు. అనంతరం 108, 102 సిబ్బందిని అభినందించిన ఆయన, మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే 108 సేవల అమలులో మొదటి స్థానంలో నిలిచిందని, దీనికి అంబులెన్స్ సిబ్బందే కారణమని ప్రశంసించారు.

## యూనియన్ బ్యాంక్ సేవా కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/జన్నారం:** జన్నారం మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్ సేవా కేంద్రాన్ని సోమవారం బ్రాంచ్ మేనేజర్ సచిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ రమేష్ జిరాక్స్ అండ్ ఆన్లైన్ సర్వీస్ సెంటర్‌లో యూనియన్ బ్యాంక్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలకు యూనియన్ బ్యాంక్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. చిన్న చిన్న లావాదేవీలతో పాటు ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన్ మంత్రి సురక్షా బీమా యోజన వంటి పథకాలతో పాటు మరిన్ని బ్యాంకు సేవలు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉపాధ్యాయుల పాత్రను ఆవిష్కరించిన విద్యార్థులు

**ప్రజాపక్షం/పెంచికల్ పేట్:** విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను చక్కగా ఆవిష్కరించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పిఎం శ్రీ జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయ స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు తరగతుల్లో ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ బోధన చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయుల పట్ల గౌరవం, వారిని అనుసరించాలనే స్ఫూర్తి ఈ కార్యక్రమం ద్వారా ప్రతిబింబించిందని హెడ్‌మాస్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగా భవాని, షేక్ బడే సాహెబ్, లక్ష్మి, భారతి, సంతోష్, ఆత్మరామ్, ఈశ్వరరావు, ఉజ్వల, భాగ్యశ్రీ, నాగరాణి పాల్గొన్నారు.

## ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :** సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంఈఓ శ్రీనివాస్, తహసీల్దార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి..




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను అమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని ఆదేశించారు. మడలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. ప్రగతి సమీక్ష ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారుల ఎంపిక సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో 98శాతం మొక్కలు నాటినట్లు ఆమె తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు,ఎప్పటికప్పుడు ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించాలని ఆదేశించారు. వినాయకప నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ నెల 10న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఉన్నందున, అధికారులు తమ శాఖల నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పీసీఈవో గోవింద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/తాండూర్:** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా తంగళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుండి ఐబి చౌరస్తా కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మల్లేశం మాట్లాడుతూ మండలంలో నిరక్షరాస్యతను పూర్తిగా రద్దు చేసి వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. రమేష్, మురళి, సిఆర్‌పిలు నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

## పంచాయతీల సమస్యలపై బిజెపి నాయకుల ఫిర్యాదు

**ప్రజాపక్షం/తాండూర్:** తాండూర్ మండలంలోని పలు గ్రామపంచాయతీల సమస్యలను పరిష్కరించమని బిజెపి నాయకులు సోమవారం ప్రజావాణి ఫిర్యాదు విభాగంలో అధికారులకు ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి మాట్లాడుతూ పంచాయతీల్లో అపరిశుభ్రత, పందులు, కుక్కల స్వైర విహారం వల్ల మహిళలు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని, వీధిలైట్లు సరిగా లేకపోవడం, యువకుల అధిక వేగంతో డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమవుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు కోసం అధికారులకు సూచన ఇచ్చినా, నెల రోజుల తర్వాత కూడా హామీ నెరవేరలేదని ఆయన విమర్శించారు. అంతేకాక, కొన్ని ప్రాంతాల్లో నీటి పైపులు పగిలి నీరు లీక్ అవ్వడం, సంత వద్ద మరుగుదొడ్ల లేమి వంటి సమస్యలు కూడా పరిష్కరించబడలేదని గుర్తు చేశారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిలువేరు శేషగిరి, సిద్ధం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా అజగిరి లాలయ్య



**ప్రజాపక్షం / నందిపేట్ :** రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా పిజి. హెడ్ మాస్టర్ అజగిరి లాలయ్యకు అరుదైన గౌరవం లభించింది. హైదరాబాద్‌లోని రవింద్రభారతి వేదికగా దిల్‌సె గురువందనం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 డి ఆధ్వర్యంలో దిల్‌సే గురువందనం పేరుతో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిలాపూర్ పిజి హెడ్‌మాస్టర్ లాలయ్యను ఉత్తమ ఉపాధ్యాయుడుగా డిస్ట్రిక్ గవర్నర్ ఏ. అమర్‌నాథ్ చేతుల మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ జి. బాబురావు, పిడిజిలు పాల్గొన్నారు. సుమారు 110 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పెద్ద ఎత్తున లయన్స్ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్, జోన్ ఛైర్మన్ దారం భూమన్న, నందిపేట్ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రయాణికులపై మందుబాబుల దాడి



**ప్రజాపక్షం/చెన్నూరు:** మద్యం మత్తులో ఉన్న కొందరు మందుబాబులు ప్రయాణీకులపై దాడి చేసి గాయపరచిన ఘటన చెన్నూరులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు సహాయం కోసం పోలీసులను ఆశ్రయించినా, వారు నిర్లక్ష్యంగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళ్తే, చెన్నూరు పట్టణానికి చెందిన పలువురు మందుబాబులు ప్రతాప మారుతీ ఆలయ ఆవరణలో బస్ కోసం ఎదురుచూస్తున్న కొల్లూరు గ్రామానికి చెందిన ముగ్గురు దళిత యువకులపై దాడి చేశారు. ఈ దాడిలో పాలారపు జగదీశ్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణీకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు దాడి చేసిన వారు అక్కడి నుండి పరారయ్యారు. అనంతరం బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలనుకున్నా, నైట్ డ్యూటీలో ఉన్న పోలీసులు తమను పట్టించుకోలేదని, తక్షణమే హైదరాబాద్ వెళ్ళాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ పిర్యాదు స్వీకరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఓ కానిస్టేబుల్ తమ పట్ల కుల వివక్ష చూపుతూ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా ఫోన్‌ను లాగేసుకున్నారని ఆరోపించారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఆలయ ఆవరణలో ప్రతిరోజూ మద్యం సేవిస్తూ ప్రయాణీకులను ఇబ్బంది పెడుతున్న పండ్ల షాపు నిర్వాహకులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో అక్రమంగా ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పండ్ల షాపును తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దాడి విషయమై చెన్నూరు సిఐ దేవేందర్ రావును ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

## మహిళలపై లైంగిక వేధింపుల నిరోధకు కఠిన చర్యలు




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ ఉద్యోగులు పని చేసే ప్రదేశాలలో ఎదురయ్యే వేధింపులను నివారించడానికి పోష్ యాక్ట్ 2013ను అమలు చేస్తున్నట్టు, గౌరవపూర్వక వాతావరణాన్ని కల్పించడం జరుగుతున్నట్టు తెలిపారు. మహిళలపై అసభ్య ప్రవర్తన, లైంగిక వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ చట్టం ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలలో పనిచేసే మహిళలందరికీ వర్తిస్తుందని వివరించారు. ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, వేధింపులకు గురైన వారు కమిటీలో ఫిర్యాదు చేసుకునే హక్కు ఉందని తెలిపారు. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం నిర్భయంగా ఫిర్యాదు చేయాలని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త శారద, డా. అనూష, రాణి, డిప్యూటి డెమో మార్త, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని బామ్ని కె ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ మహిళా, అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్లున్నారని వారి స్ఫూర్తితో ప్రతి మహిళ రాణించాలని అన్నారు.అనంతరం ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో విద్యార్థులందరికీ టై బెల్ట్,ఐడి కార్డ్స్ పంపిణీ చేయడంతో గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి ప్రవళిక,పంచాయతీ కార్యదర్శి విట్టల్, అంగన్వాడీ టీచర్ పారానా, ఉపాధ్యాయులు, గ్రామ వీడీసీ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శరవేగంగా నూతన గ్రామపంచాయతీ బిల్డింగ్ పనులు

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని అర్లి గోడిసెర గ్రామంలో నూతనంగా గ్రామపంచాయతీ బిల్డింగ్ పనులు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ భోజవ్వ గంగాధర్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ 20 లక్షల నిధులతో గ్రామపంచాయతీ భవనం నిర్మించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం సబ్ స్టేషన్ లో కొత్త పవర్ ట్రాన్స్ఫార్మర్ పెట్టడం వలన ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లోకేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలో గల నగర్, కిస్టాపూర్, మల్కాపూర్, శివారం, లోకేశ్వరం టౌన్, రాయపూర్ కాండ్లీ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు శ్రీనివాస్ రెడ్డి,ఏడీఈ ప్రదీప్ ఏఈ శివకుమార్ తెలుపుతూ ప్రజలు సహకరించాలని కోరారు.

## రైతులకు రాయితీపై యంత్రాలు

**ప్రజాపక్షం/తాండూర్:** రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తామని తాండూర్ మండల వ్యవసాయ అధికారిణి కె.సుష్మా తెలిపారు. 2025, 26 సంవత్సరానికి గాను ప్రభుత్వ వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్టు ఆమె వివరించారు. మండలానికి మొత్తం 121 బ్యాటరీ స్ప్రేయర్లు (జనరల్ 89, ఎస్టి 18, ఎస్టి 14), 21 పవర్ స్ప్రేయర్లు (జనరల్ 16, ఎస్సి, 3, ఎస్టి 2), 8 రోటివేటర్లు (జనరల్ 6, ఎస్సి 1, ఎస్టి 1), 1 సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్, 7 ట్రాక్టర్ డ్రోన్ ఇంప్లిమెంట్స్ (జనరల్ 5, ఎస్సి 1, ఎస్టి 1), 1 పవర్ వీడర్, 1 బ్రష్ కట్టర్, 1 బండ్ ఫార్మర్, 1 పవర్ టిల్లర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు, ఎస్సి, ఎస్టి మహిళా రైతులకు 50 శాతం రాయితీ, మిగతా రైతులకు 40 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు ఫారం, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, ట్రాక్టర్ ఆర్‌సి బుక్ జిరాక్స్, డిమాండ్ డ్రాఫ్ట్ వివరాలతో ఈనెల 12లోపు మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## కొండాపూర్ చౌరస్తా రోడ్డు పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/కాసిపేట:** కొండాపూర్ చౌరస్తా రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలని మాదిగ హక్కుల దండోరా సంఘం అధ్యక్షుడు అటుకపురం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కొండపూర్ రోడ్డులో గల గుంతల వద్ద బురదలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు రెండు సంవత్సరాలుగా పూర్తిగా కుంగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు కమిషన్ల కోసం ఉద్దేశపూర్వకంగా పనులను ఆపేస్తున్నారని ఆరోపించారు. కాసిపేట, దేవాపూర్ మార్గంలో ప్రయాణించినా, కొండాపూర్ రోడ్డును పట్టించుకోలేదని, ఎంఎల్ఎ వినోద్ వెంటనే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# విరాట్ శ్రీమాన్‌కు డాక్టర్ అన్నపూర్ణ బదౌరియా స్మారక పురస్కారం



**ప్రజాపక్షం/నిజామాబాద్:** హిందీ కవి విరాట్ శ్రీమాన్‌కు డాక్టర్ అన్నపూర్ణ బదౌరియా స్మారక జాతీయ స్థాయి గౌరవం లభించింది. రూరల్ నియోజకవర్గం కాలూర్ జడ్పీహెచ్‌ఎస్ హిందీ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న శ్రీమన్నారాయణాచార్య విరాట్‌కు జాతీయ పురస్కారం అందుకోవటం జిల్లా కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆధిత్య సంస్కృతి సాహిత్య మాస పత్రిక వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7, 8న మధ్యప్రదేశ్‌లోని దతియాలో అఖిల భారతీయ సాహిత్యకార్ సమ్మేళనం సందర్భంగా ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు. జాతీయ హిందీ దినోత్సవ ప్రారంభ కార్యక్రమం పురస్కరించుకుని జరిగిన హిందీ మహోత్సవం కవి సమ్మేళనంలో దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల నుండి ప్రముఖ కవులు కవులు, సాహిత్యకారులు పాల్గొన్నారని ఈ వేదికపై శ్రీమన్నారాయణాచార్య విరాట్ తన కావ్య ప్రతిభను ఆవిష్కరించి అందరి ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యప్రదేశ్ మాజీ హోంశాఖ మంత్రి నరోత్తం మిశ్రా, ఆధిత్య సంస్కృతి మాసపత్రిక సంపాదకులు జగత్‌శర్మ, భాను శర్మ, మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ డైరెక్టర్ వికాస్ దవే, ప్రఖ్యాత గీత రచయిత గీత్ గాగర్, సంపాదకులు దినేష్, ప్రభాత్‌లు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని శ్రీమన్నారాయణాచార్య విరాట్‌కు అందజేశారు. ఈ పురస్కారం లభించటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, ఉపాధ్యాయులు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆనయకు అభినందనలు తెలిపారు.

## ముత్యాల చెరువు మరమ్మతులు చేపట్టవద్దు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ముత్యాల చెరువు మరమ్మతులు చేపట్టి మా ప్రాణాలతో చలగాటమాడొద్దని వాడీ, హోన్నాజీపేట్, బీరప్ప తండా, వాల్గోట్, చిన్నవాల్గోట్, గడ్కోల్, మద్దుల్ తండా, సీతాయిపేట్ తండా గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం అదనపు కలెకటర్ కిరణ్‌కుమార్‌కు ముత్యాల చెరువు బాధితులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ముత్యాల చెరువు తెగిపోవటంతో నష్టపోయిన గ్రామాల బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వివరిస్తూ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నడిమి తండా ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోవటంతో వరద ఉధృతికి ఇళ్లు పంట పొలాలు నష్టపోయాయని, ఉదయం పూట జరగటంతో ప్రాణాలు దక్కించుకున్నామని, అదే రాత్రిపూట జరిగి ఉంటే గ్రామాలకు గ్రామాలే ప్రాణాలు కోల్పోయే వారమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి నష్టం జరిగిన ముత్యాల చెరువుకు మరమ్మతులు చేసి మాప్రాణాలతో చలగాటమాడవద్దని కోరారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ స్పందిస్తూ ఇరిగేషన్ అధికారులు ఈ విషయంపై విచారణ జరిపి గ్రామాలకు ఇబ్బంది జరగకుండా చూడాలని ముత్యాల చెరువుపై మరమ్మతులపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఎవరికి ఇబ్బంది జరగకుండా చూస్తామన్నారు.

## ప్రధాన రహదారిపైనే మురుగు నీరు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** మురుగునీటి కాల్వ లేక రోడ్లపై మురుగు నీరు ప్రవహించడంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై మురుగు నీరు ప్రవహించకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామ శివారులో ఠాణాకలాన్ చౌరస్తా వద్ద గ్రామంలో నుంచి వచ్చే మురుగు నీరు బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపైనే ప్రవహిస్తుండటంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది కాలంగా రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తున్న గ్రామ పంచాయతీ మాత్రం తమకేమీ పట్టన్నట్లుగా వ్యవహరించడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## క్రీడోత్సవాల ప్రారంభంలో ఎమ్మెల్యే వేముల



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కమ్మర్‌పల్లి మండల పాఠశాలల క్రీడోత్సవాల ప్రారంభం అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యతో పాటు క్రీడలు ముఖ్యమని, క్రీడలు ఆడటంతో శారీరక ధృఢత్వంతో పాటు మానసికంగా ప్రశాంతత లభిస్తుందని, క్రీడలు మనలో క్రీడా స్ఫూర్తిని నెలకొల్పుతాయని ఎవరైతే క్రీడలో ఆడరో వారు జీవితంలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు తట్టుకోలేరన్నారు. క్రీడలు ఆడేవారు జీవితంలో ఎదురయ్యే సమస్యలను తట్టుకుని వాటిని అధిగమించి నిలబడుతారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహామందించాలనిజిల్లాలో ఆరూమర్ డివిజన్‌లో మంచి పీఈటీసీలున్నారన్నారు. మార్చ్‌ఫాస్ట్ కూడా పిల్లలందరూ చాలా చక్కగా ప్రదర్శించారని ఇనాయకత్‌నగర్ ఉప్లూర్ పాఠవాల విద్యార్థులకు మా వియ్యాంకుడు దయానందరెడ్డి సహకారంతో షూస్ డ్రెస్‌లు అందజేసేలా కృషి చేస్తాను. అమీర్‌నగర్ గ్రామ పాఠశాలకు పీఈటీని ఇప్పించంలో తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వానికి విన్నవించి మంజూరయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. నృత్యప్రదర్శన చేసిన విద్యార్థినులు చాలా చక్కగా అభనయించారు. వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, డీవైఎస్‌డీఓ పవన్, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, వైస్‌చైర్మన్ ఆకుల రాజన్న, పీడీలు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్, రాజకుమార్, తహసీల్దార్, ఎంపీడీఓలు, పీఈటీలు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రాజకీయ రంగు పులుముకున్న మార్కెట్ తరలింపు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** గత కొంతకాలంగా కొనసాగుతున్న మార్కెట్ తరలింపు సమస్య రాజకీయ రంగు పులుముకుంది. మీరంటే మీరంటే ఒకరిపై ఒకరు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రాలను సోమవారం అందజేశారు. వివరాల్లోకి వెళితే బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ ముట్టడికి పిలుపునివ్వటంతో బీజేపీ నాయకులంతా చేరి మున్సిపల్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేయాలనుకున్న కమీషనర్ అందుబాటులో లేకపోవటంతో మున్సిపల్ సిబ్బందికి మార్కెట్ తరలించాలని కోరుతూ మెడిసిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు కనికరం మధు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా రోడ్లపై పండ్ల బండ్లు కూరయగాలను విక్రయించటంతో దుకాణదారులకు వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇట్టి విషయంపై దుకాణదారులు తమను సంప్రదించటంతో మున్సిపల్ ముట్టడికి పిలుపునిచ్చారన్నారు. మార్కెట్‌ను పాత తహసీల్దార్ కార్యాలయం ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయాలని దీంతో ట్రాఫిక్ సమస్య తీరుతుందని తెలిపారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి వచ్చిన వారు స్పందించకపోవటంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అనంతరం కార్యాలయానికి చేరుకున్న బీజేపీ నాయకులు గత కొన్ని రోజుల క్రితం ఎంపీ అరవింద్ పట్టణంలో తపాలా శాఖ కార్యాలయం మంజూరు చేయించారన్నారు.

ఇట్టి విషయంపై తహసీల్దార్కు వినతిపత్రం ఇవ్వాలని అనుకున్న అందుబాటులో లేకపోవటంతో రెవెన్యూ సిబ్బంది అందజేశామన్నారు. బీజేపీ ముట్టడి విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ కార్యాలయం చేరకుని ఇదివరకే మున్సిపల్ కమీషనర్‌కు మార్కెట్ తరలించాలని కోరామని అధ్యక్షులు స్వామి తెలిపారు. ఏది ఏమైనాప్పటికీ మార్కెట్ సమస్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయని ప్రజలు గుసగుసలాడుతున్నారు.

## ముత్యాల చెరువుతో మా గ్రామానికి ముంపు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** ముత్యాల చెరువు తెగిపోవటంతో నష్టం వాటిల్లింది. వాడీ గ్రామంలోకి వరదనీరు వచ్చి ఇళ్లు, పంట పొలాలు, నష్టపోయామని ముత్యాల వాగు మరమ్మతులు చేయవద్దని ఒకవేళ నిర్మాణం చేపడితే చాలా గ్రామాలకు ప్రాణాహానీ ఉందని వాడీ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ జిన్నా సాయిలు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరారు. సోమవారం వాడీ, హోన్నాజీపేట్, గడ్కోల్, చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్, కొండూర్ వీడీసీ చైర్మన్లతో పాటు గ్రామస్తులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ముత్యాల చెరువు తెగి వరదతో నష్టపోయామని కోరారు. అక్కడ మళ్లీ చెరువు మరమ్మతులు చేపడితే మాకు నష్టం జరిగే అవకాశాలున్నాయని ఆ చెరువుతో మాకు ఎలాంటి ప్రయోజనం లేదని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన గ్రామాన్ని ఆదుకుంటామని, వరదలతో రూరల్ నియోజకవర్గం చాలా నష్టపోయింది నిధులు కేటాయించాలని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముత్యాల చెరువు కట్ట మట్టితో ఉండటంతో తెగిపోయిందని, ఏ గ్రామానికి నష్టం వాటిల్లకుండా చెరువు కింద మత్తడి నిర్మించి చెక్‌డ్యాంలు నిర్మించి చెరువులు నిండేలా ఏర్పాటు చేస్తామన్నారు.ఇరిగేషన్ అధికారులతో చర్చించి ఎవరికి ఏ విధంగా నష్టం లేకుండా చూస్తామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొత్త వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, భాస్కర్, కొండూర్ రమేష్, దండు నర్సయ్య, సంతోష్, సాయిలు, సతీష్, గంగారెడ్డి, కర్క రమేష్, నర్సయ్య, రవీందర్, గంగామోహన్, సాయికిరణ్, గంగాధర్, రాంచందర్, రమేష్, ముస్తపా, శివ, లింగం, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణికి 114 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/నిజామాబాద్:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 114 ఫిర్యాదులు అందాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్‌డీఓ సాయ గౌడ్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, డీపీఓ శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో యువకుడు మృతి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** అనారోగ్యంతో నిజాంసాగర్ మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఓ యువకుడు ఆదివారం మృతిచెందాడు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన వడ్డె రవి(25) అనే యువకుడు ఒంటరిగా జీవిస్తుండగా తన బాబాయ్ కుమారునికి కల్లు తెమ్మని చెప్పి అతను పొలం వద్దకు వెళ్ళిపోగా తిరిగి వచ్చి చూసేసరికి రవి ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందిపడుతున్నట్లు గుర్తించి వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికే రవి చనిపోయినట్లు వైద్యులు పేర్కొన్నారు. వడ్డేపల్లి పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దరఖాస్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## నీటిలో గల్లంతైన వ్యక్తి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మయండలంలోని బంజపల్లి గ్రామానికి చెందిన పసుల రాజు (35) తండ్రి గంగయ్య ఆదివారం వాగునీటిలో గల్లంతైనట్లు ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. పసుల రాజు వ్యవసాయ పనులు చేసేవాడని, ఆదివారం సాయంత్రం తన పంటపొలం వద్ద బోరు మోటార్ చూసేందుకు వెళ్ళి కళ్యాణి వాగు వద్ద తన మోటార్ సైకిల్, తాను వేసుకున్న బట్టలు పెట్టి వాగులో దిగగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండి అదే నీటిలో రాజు గల్లంతైనట్లు ఎస్సై వెళ్ళడించారు.

## ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం


**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పాధ్యాయులను ఎంఈఓ దేవిసింగ్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను వారిని మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్ సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర ఎంతో కీలకమైందని, చిన్నారులను భావి భారత పౌరులుగా తీర్చే భాద్యతను భుజాన వేసుకున్న ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాధ్యాయులు, పీఆర్‌టీయు అధ్యక్షుడు బన్సీలాల్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధికారులందరికి ప్రత్యేక ధన్యవాదాలు

**ప్రజాపక్షం/నందిపేట్ :** గత పదిహేను రోజులుగా వినాయక చతుర్థి నుంచి, అంతకంటే ముందు నుంచి వినాయక నిమజ్జనం వరకు నిర్విరామంగా శ్రమపడిన సెక్షన్ ఆఫీసర్లకు, స్టాఫ్ అందరికి ఎడి అశోక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా గత ఐదు రోజుల నుంచి నిద్రాహారాలు మాని 24 గంటలు శ్రమించి ఎక్కడ కూడా చిన్న ఇబ్బంది లేకుండా వినాయక నిమజ్జనం జరుపుకున్నామని దీనికి సహకరించిన అందరికి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా సహకరించిన డివిజనల్ ఇంజనీర్ కి సూపరింటెండెంట్ ఇంజనీర్‌కు, సిఎండికి ధన్యవాదాలు తెలిపారు.

అన్ని శాఖల వారికి పోలీసు, రెవెన్యూ, మునిసిపాలిటి, పంచాయతీరాజ్, ఆరోగ్య తదితర శాఖల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినాయక నిమజ్జనంలో, వినాయక చతుర్తిలో సహకరించిన వినాయక భక్తులకు, విద్యుత్తు వినియోగదారులందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాంగ్రెస్‌కు పెరుగుతున్న మద్దతు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా రాజకీయాల్లో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి.ఒకప్పుడు బలంగా ఉన్న బీజేపీకి క్రమంగా ఆదరణ తగ్గుతుండగా,కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు శక్తివంతంగా ఎదుగుతోంది.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని జిల్లా రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.ఈ పరిస్థితి జిల్లాలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారి తీస్తోంది.

**కాంగ్రెస్ దూకుడు,ప్రజల విశ్వాసం..**

నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు శ్రీహరిరావు చూపుతున్న నాయకత్వం ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని పెంచుతొంది.ఆయన కేవలం నాయకులతో,కార్యకర్తలతోనే కాకుండా ప్రజలతో కూడా సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఆయన వద్దకు తీసుకువస్తే,శ్రీహరిరావు తక్షణం స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేలా చూస్తున్నారు.సమస్యలు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉండకుండా, త్వరగా పరిష్కారం కావడంతో ప్రజల్లో కాంగ్రెస్ పై నమ్మకం మరింతగా బలపడుతొంది.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తోంది. దీనివల్ల జిల్లా స్థాయిలో సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయి. ఉదాహరణకు, నిధుల మంజూరు, అభివృద్ధి పనులు ఆమోదం వంటివి వేగంగా జరుగుతున్నాయి.ఈ సానుకూల వాతావరణం, ప్రభుత్వ సహకారం కాంగ్రెస్ పార్టీకి అదనపు బలంగా మారింది.

**బీజేపీకీ ఆదరణ లేమి కారణాలు..**

మరోవైపు,బీజేపీకి జిల్లాలో మునుపటిలా ఆదరణ లేకపోవడం ప్రజల్లో నిరాశకు కారణమవుతోంది.స్థానిక సమస్యల పరిష్కారంలో బీజేపీ నాయకత్వం చురుకుదనం చూపించకపోవడం,ప్రజల సమస్యలపై తగినంత దృష్టి పెట్టకపోవడం వంటి కారణాలు ఆ పార్టీకి వ్యతిరేకంగా మారాయి.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నాయకులను ఆశ్రయించినప్పటికీ,తక్షణ ఫలితాలు రాకపోవడంతో ఆ పార్టీపై నమ్మకం సన్నగిల్లింది.ఈ పరిస్థితి కాంగ్రెస్ పార్టీకి మరింత అనుకూలంగా మారింది.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం..?**

రాజకీయ పరిశీలకుల విశ్లేషణ ప్రకారం, రాబోయే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలమైన పోటీని ఇచ్చి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి.డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు చూపుతున్న సమర్థ నాయకత్వం, ప్రజల సమస్యల పట్ల చూపుతున్న తక్షణ స్పందన, రాష్ట్ర ప్రభుత్వ సహకారం వంటి అంశాలు కలిసి కాంగ్రెస్ పార్టీకి గెలుపు మర్గాన్ని సుగమం చేస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.నిర్మల్ రాజకీయాల్లో ఈ కొత్త ధోరణులు భవిష్యత్తులో మరిన్ని మార్పులకు దారి తీయవచ్చని రాజకీయ పండితులు భావిస్తున్నారు.

## ఇబ్రహీం సాగర్ చెరువు ఆక్రమణపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళన..

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిద్ధాపూర్ గ్రామంలోని ఇబ్రహీం సాగర్ చెరువును కొంతమంది అక్రమంగా పూడ్చివేస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ ఆరోపించారు.ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నం.242 లో ఉన్న సుమారు 38 ఎకరాల 8 గుంటల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును అక్రమంగా పూడ్చడం వల్ల దాని విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించడమే కాకుండా,భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు తగ్గి తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున వెంటనే సర్వే నిర్వహించి, చెరువు సరిహద్దులను గుర్తించి, అక్రమంగా ఆక్రమించిన స్థలాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.అలాగే,ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చెరువు చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్, పి.వసంతరావు, అబ్దుల్ సాదిక్, ఇమ్రాన్, చిన్నన్న, మహేష్, నరసయ్య, ఎల్లన్న, భూషణ్ అన్నతో పాటు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో పుస్తకా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం వరగంటి పందరి విప్లవ ప్రస్థానంకు సంబంధించిన ఆరని వెలుగుసూర్యం అనే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు సోమవారం ప్రకటనలో నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 11.30 నిమిషాలకు ప్రారంభమవుతుందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం,నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు,ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎంపీ సోయం బాపూరావు లు రానున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నిర్మల్ జూనియర్ కళాశాలలో మత్తు నిరోధక అవగాహన




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల,ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం మత్తు పదార్థాల నిరోధక అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ఆనందిత ఫౌండేషన్ చైర్మన్,మోటివేషనల్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్ ముఖ్య వక్తగా హాజరయ్యారు.వాడేకర్ లక్ష్మణ్ మాట్లాడుతూ,మత్తు పదార్థాలు తాత్కాలిక సంతోషాన్ని ఇచ్చినా,జీవితాన్ని నాశనం చేస్తాయి.వాటికి బానిసలైతే విద్య,కుటుంబం,భవిష్యత్తు అన్నీ కోల్పోతారు.కాబట్టి విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచిఅలవాట్లను పెంచుకోవాలి.గొప్ప లక్ష్యాలను పెట్టుకుని కష్టపడితేనే విజయం సాధించగలరు అని సూచించారు.అలాగే,తల్లిదండ్రులు,గురువులను గౌరవించాలని,సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు.క్రమశిక్షణతో కూడిన జీవనం భవిష్యత్తులకు బలమైన పునాది అని నొక్కి చేప్పారు.ఈ కార్యక్రమంలో రచయిత గాయకుడు తోట లక్ష్మణ్ తన పాటలతో,భావోద్వేగపూరితమైన మాటలతో విద్యార్థులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమాన్ని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జుఫిసియన్ సుల్తానా,బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తుకారాం,అధ్యాపకులు,వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు సరైన మర్గదర్శనం అందిస్తాయని పాల్గొన్నవారు అభిపాయపడారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం..



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యార్థులు కష్టపడి చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని జుమ్మేరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులు అధికారులకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వారోత్సవాలను సెప్టెంబర్ 1 నుండి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులతో పాటు నిరక్షరాస్యులైన పెద్దలను కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు.విద్య మనిషిని ప్రయోజకుడిగా మారుస్తుందని,విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదల,అంకితభావం,స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు పలు నితి కథలను కూడా ఆయన వివరించారు.వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ శుభాకాంఓలు తెలిపి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో డీఈఓ డి.భోజన్న,డిఆర్‌డిఓ విజయలక్ష్మి,మెప్మా పీడీ సుభాష్,ఎంఈఓ నాగేశ్వర్ రావు,ఇతర విద్యాశాఖ అధికారులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

## భీమ్ విగ్రహనికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** సుప్రీం కోర్టు సూచించిన న్యాయమద్ధమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నివేదికలు అందజేయాలని రాజ్ గోండ్ సేవా సమితి రాయి సెంటర్ సార్ మేడి అత్రం గంగారం,ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి తెల్లం వెంకట్రావు, సోయం బాపూరావు,ఫ్లెక్సీ లకి పాలాభిషేకం చేయడం జరిగింది. వారు నినాదాలు చేస్తూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగ్నక్ ప్రకాష్, మండాడి భీమారావు, ఆత్రం జలపతి, ఆదివాసి గ్రామాల పటేళ్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రాజురలో ఉపాధి హామీ గ్రామసభ

**ప్రజాపక్షం/లోకేశ్వరం:** లోకేశ్వరం మండలంలోని రాజుర గ్రామంలోని ఉపాధి హామీ తనిఖీలు డిఆర్పి బాబురావు నిర్వహించారు.ఈ సదర్భంగా డిఆర్పి మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఉపాధి కూలీల యొక్క పేమెంటను పరిశీలించడం జరిగందని బర్ల షెడ్లు గొర్ల షెడ్లు నూతనంగా నిర్మించుకున్న వారివి పరిశీలించడం జరిగిందని నూతనంగా బర్లషెడ్లు,నూతనంగా నిర్మించుకోవాలని సద్వినియోగం చేసుకొవాలని తెలిపారు. గ్రామంలో మొత్తం లేబర్ ఖర్చు 55,81,658,మెటీరియల్ 4,48,543 వారి ఉపాధి హామీ మొత్తం ఖర్చు 6066201.ఉపాధి హామీలో లేబర్ పేమెంటు ఉపాధి హామీ కూలీలు డబ్బులు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఏ.రవీందర్ విడిసీ ముత్తాగౌడ్ ఉమెన్ రైట్స్ కన్వీనర్ సరస్వతి ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్ కారోబరి కరీం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**ప్రజాపక్షం/నిర్మల్ :** విద్యారంగ సమస్యలు,ఉపాధ్యాయుల పరిష్కారానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అన్నివేళలా కృషి చేస్తుందని,ఉద్యోగ ఉపాధ్యాయులకు సి.పీ.ఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టియుటిఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం నిర్మల్ పట్టణంలోని పలు పాఠశాలలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పెన్షనర్స్ బిల్లులు,ఉపాధ్యాయల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన ప్రాథమిక పాఠశాలలలో సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వము విద్యా వాలంటీర్లను నియమించాలని తద్వారా గుణాత్మక విద్యాసాకారం అవుతుంది.అనంతరం ఉపాధ్యాయుల నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

## జిల్లా ఉద్యోగలకు క్రీడా పోటీలు..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని యన్‌టిఆర్ మినీ స్టేడియంలో జిల్లా ఉద్యోగుల కోసం వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. చెస్, క్యారమ్, టెన్నిస్ వంటి ఇండోర్ గేమ్స్ తో పాటు మరికొన్ని ఆటలు ఉత్సాహంగా జరిగాయి.పోటీదారులు ప్రతి విభాగంలోనూ అద్భుతమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు.ఈ సదర్భంగా డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు, ఎం.శ్రీనివాస్, రమణారావ్, అన్నపూర్ణ, సత్తయ్య, అంబాజీ, భోజన, వెన్నెల, భూమన్నలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని అలాంటి ఉపాధ్యాయులను అభినందస్తున్నామని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని హాల్‌లో 21 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశామన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ సన్మానం ఉపాధ్యాయులకు మరింత బాధ్యతను పెంచుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.